తెలంగాణ
# వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871






హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :80 08-10-2026 గురువారం పేజీలు: 4 వెల:03/-


# రికార్డుల్లో 388 ఎకరాలు.. సర్వేలో 343 ఎకరాలే..

## ఎర్రవల్లి భూములపై సీఎం కీలక ఆదేశాలు

హైదరాబాద్: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలోని భూముల వ్యవహారంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో రికార్డుల ప్రకారం 388 ఎకరాల భూమి ఉండగా.. తాజాగా నిర్వహించిన సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రికార్డుల్లో ఉన్న భూమికి, క్షేత్రస్థాయిలో గుర్తించిన భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉన్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో 45 ఎకరాల భూమి వివరాలను తేల్చేందుకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో వెంటనే సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సర్వే నంబర్ 325 సమీపంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఆయన కుటుంబ సభ్యులకు భూములు ఉన్నందున.. ఆయా భూములకు సంబంధించిన రికార్డులను

మిగతా వివరాలు రెండో పేజీలో..



## డీఏ బకాయిల చెల్లింపునకు ఉత్తర్వులు

### ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలు మంజూరు



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు దసరా వేళ ఊరటనిచ్చింది. 2024 జనవరి, జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు కరువు భత్యాల(డీఏ)ను మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు డీఏలు కలిపి 6.27 శాతం మేర పెరుగుదల ఉండనుంది.పెంచిన డీఏను 2026 అక్టోబర్ నెల జీతంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. 2016 పే స్కేల్ ఉద్యోగులకు డీఏను 46 శాతం నుంచి 50 శాతానికి, 2024 జూలై నుంచి 50 శాతం నుంచి 53 శాతానికి పెంచింది. 2006 పే స్కేల్ ఉద్యోగులకు కూడా డీఏను సవరించింది.డీఏ బకాయిల చెల్లింపును మాత్రం ప్రభుత్వం విడతల వారీగా చేపట్టనుంది. 2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు ఉన్న బకాయిలను 33 వాయిదాల్లో, 2024 జూలై నుంచి 2026 సెప్టెంబర్ వరకు ఉన్న బకాయిలను 27 వాయిదాల్లో

మిగతా వివరాలు 4 పేజీలో..

## వారానికి ఒకటి.. ఆధారాలతో బయటపెడతా

### బీఆర్ఎస్ హయాంలో నైనీ బొగ్గు బ్లాక్‌ను పట్టించుకోలేదు:

హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ఆధారాలతో సహా వారానికి ఒకటి చొప్పున ప్రజల ముందుకు తీసుకొస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ రంగంపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలకు స్పందించిన ఆయన.. గత పదేళ్ల పాలనలో తీసుకున్న నిర్ణయాలపై వాస్తవాలను పత్రాలతో వివరిస్తామని తెలిపారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా విషయంలో గత ప్రభుత్వం సరైన ప్రణాళిక రూపొందించలేదని భట్టి ఆరోపించారు. నైనీ బొగ్గు బ్లాక్‌ను పదేళ్లపాటు పట్టించుకోలేదని, తాము జోక్యం చేసుకుని అక్కడ మైనింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం నైనీ బ్లాక్ నుంచి యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గును సరఫరా



మిగతా వివరాలు రెండో పేజీలో..

## ట్రూ-అప్ ఛార్జీలు వెనక్కి తీసుకోవాలి

### ప్రజలపై రూ. 5,420 కోట్ల భారం సరికాదు: హరీష్‌రావు

హైదరాబాద్: విద్యుత్ వినియోగదారులపై మోపుతున్న రూ. 5,420 కోట్ల ట్రూ-అప్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజలను బాధ్యులను చేస్తూ అదనపు భారం మోపడం సరికాదన్నారు. ప్రభుత్వం కుంటిసాకులు చెప్పకుండా ప్రతిపక్షం లేవనెత్తుతున్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కోరారు.విద్యుత్ సరఫరా సక్రమంగా ఉంటే రైతులు సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలకు ఎందుకు దిగుతున్నారని హరీష్‌రావు ప్రశ్నించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రైతులు విద్యుత్ సమస్యలు, లోఓల్టేజీపై ఆందోళన



మిగతా వివరాలు రెండో పేజీలో..






## కొత్తపల్లి రాజారంలో ఉద్రిక్తత

### పట్టుపురుగుల పెంపకాన్ని అడ్డుకున్న అటవీ సిబ్బంది..

### గిరిజనుడికి తీవ్ర గాయాలు



మంచిర్యాల: జిల్లాలోని కొత్తపల్లి-రాజారం ప్రాంతంలో బుధవారం ఉద్రిక్తత నెలకొంది. అటవీ ప్రాంతంలో పట్టుపురుగుల పెంపకం చేస్తున్న గిరిజనులను అటవీశాఖ సిబ్బంది అడ్డుకోవడంతో వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో జరిగిన ఘటనలో చింతల లక్ష్మయ్య అనే గిరిజనుడు తీవ్రంగా గాయపడినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.గాయపడిన లక్ష్మయ్యను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పట్టుపురుగుల పెంపకంపై అటవీశాఖ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేయడంతోనే వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది.కొత్తపల్లి, రాజారం, లింగన్నపేట తదితర ప్రాంతాల్లో తసర్ పట్టుపురుగుల పెంపకంపై అనేక గిరిజన కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ ప్రాంతంలో పట్టుపురుగుల పెంపకంపై అటవీశాఖతో గిరిజనులకు గతంలోనూ వివాదాలు తలెత్తినట్లు

మిగతా వివరాలు 3వ పేజీలో..

## ఎన్ని కేసులు పెట్టినా భయపడం

### ప్రజాస్వామ్య పరిరక్షణకు విపక్షాల ఐక్య పోరాటం:



న్యూఢిల్లీ: ప్రజల ఓటు హక్కును, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు విపక్ష పార్టీలు ఐక్యంగా పోరాడతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా సవరణపై విపక్షాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజల హక్కులను కాపాడేందుకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.మంగళవారం ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఎన్నికల సంఘం కార్యాలయం వైపు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఖర్గే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు స్వాతంత్ర్యం తర్వాత లభించిన హక్కులను హరిస్తోందని ఆరోపించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణను నిలిపివేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్లను తిరిగి చేర్చాలని, ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని

మిగతా వివరాలు రెండో పేజీలో..

# లాఠీ రాజ్యంలో రాజ్యాంగం!

## ప్రశ్నించే గొంతుకలపై పోలీసు ఉక్కుపాదం!

దేశ రాజధాని ఢిల్లీ వీధులో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన హెచ్చరిక లాంటివి. స్వేచ్ఛాయుతమైన సమాజంలో విపక్షాలు, సాధారణ ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేయడం రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు. కానీ, నేడు ఆ హక్కులను తుంగలో తొక్కుతూ, రాజ్యాంగ బద్ధమైన ప్రజాప్రతినిధులను వీధుల్లో ఈడ్చిపారేస్తూ పోలీసు బలగాలతో అణచివేసే సంస్కృతి రాజ్యమేలుతోంది. ఇది కేవలం ఒక రాజకీయ ప్రదర్శనను అడ్డుకోవడం మాత్రమే కాదుబీ దేశంలో ప్రశ్నించే గొంతులను, రాజ్యాంగ సూత్రాలను కఠినంగా అణచివేయడానికి సాగుతున్న ఒక ప్రమాదకరమైన ధోరణికి సజీవ నిదర్శనం.ప్రజాస్వామ్య హక్కుల నిర్బంధం – లాఠీ రాజ్యానికి సంకేతంఎలక్షన్ కమిషన్ (ఈసీ) వంటి అత్యున్నత రాజ్యాంగ సంస్థ యొక్క నిష్పాక్షికతపై అభ్యంతరాలు, సందేహాలు వెల్లువెత్తినప్పుడు, వాటికి బాధ్యతాయుతంగా సమాధానాలు ఇవ్వాల్సింది పోయి, రక్షణ కవచంలా పోలీసు యంత్రాంగాన్ని వాడుకోవడం నిరంకుశత్వానికి పరాకాష్ట. జంతర్ మంతర్ నుంచి ఈసీ కార్యాలయం వైపు శాంతియుతంగా నిరసన ప్రదర్శనకు బయలుదేరిన 'ఇండియా' కూటమి ఎంపీలను, ముఖ్యంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వంటి అగ్రనేతలను పోలీసులు అడ్డుకున్న తీరు తీవ్ర దిగ్భ్రాంతికరం. సీఈసీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులను రోడ్లపైనే బైఠాయించేలా చేయడం పాలకుల భయాందోళనలను సూచిస్తోంది.బ్రిటీష్ కౌన్సిల్ సమీపంలో ప్రజా ప్రతినిధులపై జరిగిన లాఠీఛార్జ్, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి లాంటి నేతలకు భౌతిక దాడుల్లో గాయాలు కావడం ఏ రకమైన పాలనా విధానానికి సంకేతం? "మా ఎంపీలను కొడుతున్నారు, మమ్మల్ని రోడ్లపై ఈడ్చి పడేస్తున్నారు, మేము ఇక్కడి నుంచి కదిలేది లేదు" అని ప్రియాంక గాంధీ బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేయడం, పాలకులో పెరిగిపోతున్న తీవ్ర అసహనాన్ని తెలియజేస్తోంది. ప్రతిపక్షాలపైకి దర్యాప్తు సంస్థలను ఉపయోగించడమే కాకుండా, వీధుల్లో ప్రజాస్వామ్యయుతంగా నిరసనలు తెలిపే హక్కును కూడా పోలీసు లాఠీలతో తొక్కిపెట్టాలని చూడటం పాలకుల అహంకారానికి, అణచివేత ధోరణికి ప్రతీక.ఆత్మగౌరవాన్ని కోల్పోతున్న స్వతంత్ర సంస్థలుఅధికారంలో ఉన్న ఏ రాజకీయ పార్టీకైనా రాజ్యాంగ సంస్థలు అనుబంధ విభాగాలు కావు. ఎన్నికల సంఘం అనేది దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియపై పౌరులకు, రాజకీయ పక్షాలకు విశ్వాసాన్ని నిలిపే అత్యంత పవిత్రమైన




వ్యవస్థ. కానీ, విపక్ష ఎంపీలు సీఈసీని కలిసి వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నిస్తే, వారిని కలవడానికి కూడా నిరాకరిస్తూ పోలీసుల వెనుక దాక్కోవడం ఆ సంస్థ యొక్క ఆత్మగౌరవాన్ని, స్వతంత్రతను ఎంతగా దిగజార్చిందో స్పష్టం చేస్తోంది.ఎన్నికల వ్యవస్థ నిర్వహణలో, అంతర్గత నిర్ణయాధికార ప్రక్రియలో పారదర్శకత లేకపోవడంపై తీవ్రమైన ప్రశ్నలు ఎదురవుతున్న సమయంలో, సమాధానం చెప్పి అనుమానాలు నివృత్తి చేయాల్సిన ఈసీ, పోలీసుల బలప్రదర్శనతో నిరసనకారులను అరెస్టు చేయించడం ద్వారా తన విశ్వసనీయతను దెబ్బతీసుకుంటోంది. ప్రజాస్వామ్యం బలంగా నిలబడాలంటే రాజ్యాంగ సంస్థలు ప్రభుత్వాల ఒత్తిళ్లకు లొంగకుండా, ప్రజల నమ్మకాన్ని కాపాడేలా వ్యవహరించాలి.ప్రాధాన్యతలు విస్మరించిన పాలనా నిర్లక్ష్యంఒకవైపు రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి, విపక్ష నేతల అరెస్టులకు వేలాది మంది పోలీసులను, సమయాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని వెచ్చిస్తున్న పాలకులు, సామాన్య పౌరుల ప్రాథమిక భద్రతను మాత్రం గాలికి వదిలేశారు. దేశ రాజధానిలోని సీమాపురి ప్రాంతంలో ఐదు అంతస్తుల భవనం కుప్పకూలి, పలువురు సామాన్యులు శిథిలాల కింద చిక్కుకుపోవడం నగర పర్యవేక్షణలోని ఘోర వైఫల్యానికి సజీవ సాక్ష్యంగా నిలిచింది.సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, ఇటువంటి ప్రమాదాలు నగరాలో మౌలిక వసతుల పర్యవేక్షణ రాహిత్యాన్ని, అధికార యంత్రాంగం యొక్క నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తున్నాయి. నిర్మాణ అక్రమాలను అరికట్టడంలో, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో దారుణంగా విఫలమవుతున్న పాలకులకు, విపక్షాల నిరసనలను అణచివేయడంలో ఉన్న వేగం వారి ప్రాధాన్యతలను స్పష్టంగా తెలియజేస్తున్నాయి.ప్రజాస్వామ్య భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార మదం ఎంత పెరిగితే, అంతిమంగా అది ప్రజాకంటక పాలనకు దారితీస్తుంది. నిరసన తెలిపే ప్రతిపక్షాల రాజ్యాంగ హక్కులను కాలరాయడం, స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలను రాజకీయ అవసరాల కోసం లొంగదీసుకోవడం, సామాన్య ప్రజల ప్రాథమిక సమస్యలను విస్మరించడం దేశ భవిష్యత్తుకు క్షేమకరం కాదు. ప్రతిపక్ష నాయకులను బారాఖంబ వంటి పోలీస్ స్టేషన్లకు తరలించి, రేవంత్ రెడ్డి వంటి నాయకులు వారిని కలవడానికి వెళ్తే అడ్డుకోవడం ద్వారా ఢిల్లీ వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించారు.పాలకుల వద్ద ఉన్న పోలీసు బలగాలు తాత్కాలికంగా నిరసన గొంతులను నొక్కేయవచ్చు కానీ, ప్రజల్లో పెల్లుబుకే ఆగ్రహాన్ని ఆపడం ఏ నిరంకుశ యంత్రాంగానికీ సాధ్యం కాదు. ప్రజాస్వామ్యంలో తుది తీర్పు ఎప్పుడూ ప్రజలదే అన్న సత్యాన్ని పాలకులు గ్రహించాలి. తక్షణమే రాజ్యాంగబద్ధమైన పారదర్శకతను, ప్రతిపక్షాల హక్కులను గౌరవిస్తూ, ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించే దిశగా పాలకవర్గం ప్రవర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

## రికార్డుల్లో 388 ఎకరాలు.. సర్వేలో 343 ఎకరాలే..

సమర్పించాలని నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.సర్వే అనంతరం గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని సీఎం సూచించారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ'ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో కాలనీని అభివృద్ధి చేయాలని సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని, వచ్చే జూన్ 2లోగా నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్, మిషన్ భగీరథ భూములు మినహా మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. మల్లన్నసాగర్ నీటిని అనధికారికంగా వినియోగిస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## వారానికి ఒకటి.. ఆధారాలతో బయటపెడతా

చేస్తున్నట్లు వెల్లడించారు.రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని భట్టి తెలిపారు. విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో బొగ్గు, విద్యుత్ సరఫరాను కొనసాగిస్తున్నామని చెప్పారు. పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.హరీష్‌రావు సహా ప్రతిపక్ష నేతలు విద్యుత్ రంగంపై మాట్లాడేటప్పుడు గత పదేళ్లలో తీసుకున్న నిర్ణయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని భట్టి సూచించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను పత్రాలు, ఆధారాలతో ప్రజల ముందుంచుతామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్ణయాలపై వాస్తవాలను వరుసగా వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

# తండ్రి సేవల స్ఫూర్తితో రాజకీయాల్లోకి..

## ప్రజాసేవే లక్ష్యంగా.. మహేష్‌కుమార్ గౌడ్ ప్రస్థానం

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మహేష్‌కుమార్ గౌడ్‌ది సుదీర్ఘమైన ప్రస్థానం. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ భావజాలంతో ముందుకు సాగుతూ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం.. అంచెలంచెలుగా రాష్ట్ర స్థాయి నాయకత్వం వరకు చేరుకుంది. పదవులు వచ్చినప్పుడు బాధ్యతగా స్వీకరించడం, పార్టీ కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలవడం, ప్రజా సమస్యలను పార్టీ వేదికగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ఆయన రాజకీయ జీవితంలో ప్రధానంగా కనిపించే అంశాలు.మహేష్‌కుమార్ గౌడ్ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఆయనపై తండ్రి బొమ్మ గంగాధర్ గౌడ్ సేవా భావం చూపిన ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామ పెద్దగా ప్రజలతో మమేకమై పనిచేసిన గంగాధర్ గౌడ్.. వ్యవసాయంతో పాటు అటవీ కాంట్రాక్టర్‌గా కొనసాగుతూ గ్రామ ప్రజలకు అండగా నిలిచారు. రహత్‌నగర్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి కూడా చొరవ చూపారు. ప్రజలతో కలిసిమెలిసి ఉండటం, గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేయడం వంటి లక్షణాలు చిన్ననాటి నుంచే మహేష్‌కుమార్ గౌడ్‌పై ప్రభావం చూపాయి.విద్యార్థి దశలో ఎన్‌ఎస్‌యూఐ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించిన మహేష్‌కుమార్ గౌడ్.. నిజామాబాద్ జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, రాష్ట్ర స్థాయి ఎన్‌ఎస్‌యూఐ నాయకుడిగా పనిచేశారు. యువతను కాంగ్రెస్ వైపు తీసుకురావడంలో, విద్యార్థి సమస్యలపై స్పందించడంలో చురుకైన పాత్ర పోషించారు. అనంతరం యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలో వివిధ బాధ్యతలు చేపడుతూ రాష్ట్ర స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.రాష్ట్ర కార్యదర్శి, ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి, పీసీసీ ప్రధాన కార్యదర్శి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వంటి పలు కీలక బాధ్యతలను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్సీగా శాసన మండలిలో ప్రజా సమస్యలను ప్రస్తావించారు. ఇలా పార్టీ సంస్థాగత బాధ్యతలతో పాటు ప్రజా జీవితంలోనూ తన అనుభవాన్ని పెంచుకుంటూ ముందుకు సాగారు.



**గాంధీభవన్ ఒక దేవాలయంగా..**

కాంగ్రెస్ పార్టీకి గాంధీభవన్ కేవలం కార్యాలయం కాదు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు కలిసే వేదికగా దానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గాంధీభవన్‌ను ఒక దేవాలయంగా భావించే మహేష్‌కుమార్ గౌడ్.. పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్కడ కార్యకర్తలు, ప్రజలకు మరింత అందుబాటులో ఉండే వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు.ప్రతి వారం ఇద్దరు మంత్రులతో గాంధీభవన్‌లో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు, కార్యకర్తలు నేరుగా మంత్రులను కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పించారు. పార్టీ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను వినడం, వాటిని సంబంధిత మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఒక వారధిగా గాంధీభవన్‌ను ఉపయోగించుకునే ప్రయత్నం జరిగింది.

**ప్రజల వద్దకే వెళ్లిన పాదయాత్ర**

ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి పాదయాత్రలు చేయడం రాజకీయాల్లో కొత్త విషయం కాదు. సాధారణంగా ప్రతిపక్ష పార్టీలు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్రలు నిర్వహించడం చూస్తుంటాం. అయితే అధికారంలో ఉన్న సమయం లోనూ ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకోవడానికి, క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించడానికి పాదయాత్రలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రత్యేకంగా నిలిచింది .అధికారంలో ఉన్నామనే భావనతో కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయో తెలుసుకునే అవకాశం ఏర్పడింది. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను కలుసుకుని వారి ఇబ్బందులను వినడం, అభివృద్ధి పనులపై అభిప్రాయాలను తెలుసుకోవడం, పరిష్కరించాల్సిన సమస్యలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లడం ఈ పర్యటనల్లో ప్రధానంగా కనిపించింది.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి మార్గం చూపడమే ప్రజా జీవితంలో నిజమైన బాధ్యత. ఈ దృక్పథంతోనే ప్రజల మధ్యకు వెళ్లే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం కనిపించింది.

**కార్యకర్తలే పార్టీకి బలం**

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలంటే కార్యకర్తలతో నిరంతరం సంబంధాలు కొనసాగించడం అవసరం. ఈ విషయాన్ని గుర్తించిన మహేష్‌కుమార్ గౌడ్.. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా కార్యకర్తలకు అండగా నిలవడం, వారి సమస్యలను తెలుసుకోవడం, పార్టీ కార్యక్రమాల్లో వారిని భాగస్వామ్యం చేయడం ఆయన రాజకీయ ప్రస్థానంలో కొనసాగుతున్న అంశాలు. ఎన్నికల్లో విజయాలు, పరాజయాలు సహజమే అయినా పార్టీ పట్ల నిబద్ధతతో కొనసాగడం రాజకీయ నాయకుడికి ముఖ్యమైన లక్షణం. తండ్రి అడుగుజాడల్లో.. బొమ్మ గంగాధర్ గౌడ్ ప్రజలతో మమేకమై చేసిన సేవలు, గ్రామ అభివృద్ధి కోసం చూపిన చొరవ మహేష్‌కుమార్ గౌడ్‌కు చిన్ననాటి నుంచే స్ఫూర్తిగా నిలిచాయి. తండ్రి ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకున్న తీరు, గ్రామాభివృద్ధికి ముందుండి పనిచేసిన విధానం మహేష్‌కుమార్ గౌడ్ రాజకీయ ఆలోచనా విధానంపై ప్రభావం చూపింది.అదే సేవా భావాన్ని రాజకీయ జీవితంలో కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రయత్నం చేస్తున్నారు. స్వగ్రామంతో అనుబంధాన్ని కొనసాగిస్తూ గ్రామాభివృద్ధి, విద్యా రంగం వంటి అంశాలకు తనవంతు సహకారం అందిస్తున్నారు. కుటుంబం నుంచి వచ్చిన సేవా దృక్పథాన్ని రాజకీయ బాధ్యతలతో మేళవిస్తూ ముందుకు సాగుతున్నారు. అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి.. ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడి నుంచి ప్రారంభమైన మహేష్‌కుమార్ గౌడ్ రాజకీయ ప్రస్థానం రాష్ట్ర స్థాయి ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు, యూత్ కాంగ్రెస్ నాయకుడు, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు వంటి కీలక బాధ్యతల వరకు సాగింది.ప్రతి బాధ్యత ఆయన రాజకీయ అనుభవానికి ఒక మెట్టుగా నిలిచింది. పదవులను అలంకరించడం కంటే వాటి ద్వారా పార్టీని బలోపేతం చేయడం, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం, ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయడం అనే ఆలోచన ఆయన ప్రస్థానంలో కనిపిస్తుంది.ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన రాజకీయ ప్రయాణం తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడి స్థాయికి చేరుకోవడం వెనుక సుదీర్ఘ రాజకీయ అనుభవం, పార్టీ పట్ల విశ్వాసం, కార్యకర్తలతో అనుబంధం, ప్రజా సమస్యలపై స్పందించే తత్వం ఉన్నాయి. తండ్రి నుంచి అందుకున్న సేవా స్ఫూర్తిని రాజకీయ జీవితంలో కొనసాగిస్తూ ప్రజలకు, పార్టీకి అందుబాటులో ఉండే నాయకుడిగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.



టిపిసిసి ప్రధాన కార్యదర్శి
ఎంబడి రాజేశ్వర్

## ట్రూ-అప్ ఛార్జీలు వెనక్కి తీసుకోవాలి

చేస్తున్నారని తెలిపారు. లోఓల్టేజీ కారణంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటూ రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు.ఒకవైపు విద్యుత్ సరఫరాపై సమస్యలు ఉన్నాయని ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. మరోవైపు విద్యుత్ బిల్లులపై అదనపు భారం మోపడం ఏమిటని హరీష్‌రావు ప్రశ్నించారు. విద్యుత్ రంగాన్ని సక్రమంగా నిర్వహించడంలో ప్రభుత్వ వైఫల్యాల భారాన్ని వినియోగదారులపై వేయడం తగదన్నారు. విద్యుత్ సరఫరా, ఉత్పత్తి, కొనుగోళ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ట్రూ-అప్ ఛార్జీల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హరీష్‌రావు హెచ్చరించారు. ప్రజలపై పడే అదనపు విద్యుత్ భారాన్ని ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. కాగా, రూ. 5,420.23 కోట్లను వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి అనుమతించగా, నవంబర్ బిల్లుల నుంచి వసూళ్లు ప్రారంభం కానున్నాయి.

## ఎన్ని కేసులు పెట్టినా భయపడం

కోరారు. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం, అధికార పక్షం అంగీకరించడం లేదు.ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం విపక్షాలు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తాయని ఖర్గే తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాగా, ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ విపక్ష ఎంపీలు చేపట్టిన ఆందోళనలో రాహుల్‌గాంధీ సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.



## ఖానాపూర్ జ్యోతిబా పూలే గురుకులంలో విద్యార్థుల ఆందోళన




ఖానాపూర్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):ఖానాపూర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల కళాశాలో పీఈటీ రాజు తమపై అకారణంగా భౌతిక దాడులకు పాల్పడుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థులు బుధవారం రోడ్డెక్కారు. కళాశాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు పట్టణంలోని ప్రధాన ఎన్టీఆర్ చౌరస్తా రహదారిపై బైఠాయించి బైఠాయింపు ధర్నా నిర్వహించారు. చిన్న చిన్న కారణాలకే పీఈటీ తమను అసభ్య పదజాలంతో దూషిస్తూ తీవ్రంగా కొడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తూ న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ప్రధాన రహదారిపై కాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో చర్చలు జరిపారు. విద్యార్థులపై దాడికి పాల్పడిన పీఈటీ రాజుపై శాఖాపరమైన చర్యలు తీసుకుని కళాశాల నుంచి వెంటనే తొలగిస్తామని ప్రిన్సిపాల్ లిఖితపూర్వక హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించి ఆందోళనను విరమించారు.

## గుండంపల్లి రైతు వేదికలో ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన




దిలావర్‌పూర్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్‌పూర్ మండల పరిధిలోని గుండంపల్లి రైతు వేదికలో ఉద్యానవన శాఖ, ఆత్మ మరియు అవైల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పసుపు, కూర గాయల ఆధునిక సాగు పద్ధతులు, చీడపీడల నివారణపై రైతులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాహుల్ హాజరై రైతులు సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి భూసార పరీక్షల ఆధారంగా నాణ్యమైన విత్తన దుంపలను ఎంపిక చేసుకుని సేంద్రీయ ఎరువులతో పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. స్పైస్ బోర్డు ప్రతినిధి ఉపేందర్ మాట్లాడుతూ నాణ్యమైన పసుపునకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, బోర్డు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలైన జొన్న, ఆవాలు, పొద్దుతిరుగుడు సాగు చేయాలని, ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అవైల్ ఫౌండేషన్ సీఈవో రమేష్, ఆత్మ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, హెచ్‌ఈవో దేవన్న, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వే పని ఒత్తిడితో బీఎల్వోల తీవ్ర ఇబ్బందులు



ఖానాపూర్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఎస్ఐఆర్ సమగ్ర సర్వే విధుల్లో ఎదురవుతున్న తీవ్రమైన పని ఒత్తిడి, సాంకేతిక సమస్యల కారణంగా తాము శారీరకంగా, మానసికంగా తీవ్ర వేదనకు గురవుతున్నామని ఖానాపూర్ మండల బీఎల్వోలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఖానాపూర్ డిప్యూటీ తహశీల్దార్‌కు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన పాత మొబైల్ ఫోన్లు నిరంతరం హ్యాంగ్ అవుతుండటంతో సర్వే వివరాలు నమోదు చేయడం కష్టతరంగా మారిందన్నారు. రోజుకు 10 నుండి 12 గంటల పాటు మొబైల్ చూస్తూ కూర్చోవడం వల్ల తీవ్రమైన నడుము నొప్పి, కంటి సమస్యలు, తలనొప్పి వస్తున్నాయని వాపోయారు. సర్వే ఒత్తిడి వల్ల కుటుంబాలకు సమయం కేటాయించలేకపోతున్నామని తెలిపారు. నాలుగు నెలలుగా శ్రమిస్తున్న తమకు రూ. 30 వేల గౌరవ పారితోషికం వెంటనే విడుదల చేయాలని, కొత్త మొబైల్ ఫోన్లు సమకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ, నిడూరి విజయ, బీఎల్వోలు చంద్రమణి, వరలక్ష్మి, పుష్పలత, చంద్రకళ, ధనలక్ష్మి, మమత పాల్గొన్నారు.

## నేడు నిర్మల్‌లో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జయకృష్ణ రెడ్డి సేవలు




నిర్మల్ టౌన్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):కీళ్ల నొప్పులు, మోకాళ్ల సమస్యలు మరియు క్రీడా గాయాలతో బాధపడుతున్న రోగుల కోసం 20 ఏళ్లకు పైగా విశేష అనుభవం కలిగిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జయకృష్ణ రెడ్డి గురువారం నిర్మల్ పట్టణంలో ప్రత్యేక ఓపీ వైద్య సేవలు అందించనున్నారు. రోబోటిక్ మోకాలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సలతో పాటు కీహోల్ ఆర్థ్రోస్కోపిక్ సర్జరీలో ఆయన విశేష అనుభవం కలిగి ఉన్నారు. ఆధునిక రోబోటిక్ సాంకేతికత ద్వారా నొప్పి తక్కువగా ఉండి రోగులు వేగంగా కోలుకునే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. పట్టణంలోని దేవేందర్ రెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మరియు సూర్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన రోగులను ప్రత్యక్షంగా పరీక్షించి ఉచిత సలహాలు ఇవ్వనున్నారు. సమస్యలు ఉన్నవారు 9154989214 నంబరులో ముందస్తుగా అపాయింట్‌మెంట్ నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## పెన్షనర్స్ భవన్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

నిర్మల్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం (అక్టోబర్ 8న) నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి జి. వినూత్న తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు సమీపంలోని విశ్రాంత ఉద్యోగుల (పెన్షనర్స్) భవనంలో ఉదయం 11:00 గంటలకు ఈ సదస్సు ప్రారంభం కానుంది. సమాజంలో వయోవృద్ధుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, ఆరోగ్య సంరక్షణపై అధికారుల ఆధ్వర్యంలో సమగ్ర అవగాహన కల్పించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న వయోవృద్ధులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.




## శ్రీరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రానికి సేవాభారతి ఫ్యాన్ వితరణ



ఖానాపూర్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):ఖానాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం-1కి జాతీయ స్వచ్ఛంద సంస్థ సేవాభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రూ. 1,500 విలువైన సరికొత్త సీలింగ్ ఫ్యాన్‌ను బహూకరించారు. వేసవి, ఉక్కపోత నుంచి అంగన్‌వాడీ చిన్నారులకు ఉపశమనం కల్పించేందుకు ఫ్యాన్‌ను సమకూర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన వస్తువులను స్వచ్ఛందంగా అందించినందుకు గాను సేవాభారతి ట్రస్ట్ ప్రతినిధులకు కేంద్రం టీచర్ చంద్రకళ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవాభారతి ట్రస్ట్ ప్రతినిధులు, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## నిర్మల్ ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల సమీక్షా సమావేశం




నిర్మల్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బుధవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో వారపు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎన్నికల అధికారులు, ఏఈఆర్వోలు మరియు వివిధ రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏ-1) పాల్గొన్నారు. ఓటర్ల జాబితాలో నూతన పేర్ల నమోదు, అభ్యంతరాలు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు ప్రక్రియపై సమగ్రంగా చర్చించారు. జాబితా తయారీ పారదర్శకంగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అధికారులు కోరారు.

## పితృపక్షాల్లో ఫొటో ముందు ఇష్టమైన వంటకాలు పెట్టడమే పితృకర్మా..?

పితృపక్షాలు వచ్చాయంటే చాలు.. ఇంట్లో చనిపోయిన పెద్దల ఫొటోలు పెట్టి, వారికి ఇష్టమైన వంటకాలు తయారు చేసి ఫొటో ముందు ఉంచడం చాలాచోట్ల కనిపిస్తోంది . కొందరు మాంసాహారం, గుడ్లు, మరికొందరు మద్యం కూడా చనిపోయిన వ్యక్తికి ఇష్టమని చెప్పి ఫొటో ముందు పెడుతున్నారు. ఇదే పితృపక్ష ఆచారం అని భావించే పరిస్థితి కూడా ఉంది. అయితే అసలు ప్రశ్న ఒక్కటే.. పితృప క్షాలు అంటే ఫొటో ముందు ఇష్టమైన పదార్థాలు పెట్టడమేనా? శాస్త్రోక్త పితృకర్మలో ఫొటోకు పూజ చేసి భోజనం పెట్టాలని ఎక్కడైనా చెప్పబడిందా? శాస్త్రపరంగా పరిశీలిస్తే ఈ రెండింటినీ ఒకటిగా చూడటం సరికాదు. పితృపక్షాల వెనుక ఉన్న ప్రధాన భావం చనిపోయిన వ్యక్తి ఫొటోను పూజించడం కాదు. పితృ దేవతలను స్మరించి, వారికి నిర్దేశించిన విధంగా శ్రాద్ధం, తర్పణం, పిండప్రదానం తదితర కర్మలను నిర్వహించడం. ప్రాచీన భారతీయ పితృఆరాధనా సంప్రదాయాల పై పరిశోధనలు కూడా శ్రాద్ధాన్ని ఒక క్రమబద్ధమైన పితృకర్మగా వివరిస్తున్నాయి .మహాభారతంలోని శ్రాద్ధ విధాన వివర ణను పరిశీలించినా పితృకర్మలో పిండప్రదానం, పితృదేవతలకు సమర్పణ, తర్పణం వంటి విధానాలకే ప్రాధాన్యం కనిపిస్తుంది. పితృకర్మ అనేది కేవలం చనిపోయిన వ్యక్తి జ్ఞాపకార్థం ఆయన ఫొటో ముందు భోజనం పెట్టే కార్యక్రమంగా ఎక్కడా నిర్వచించబడలేదు. ఇక్కడ ఒక విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పాలి. చనిపోయిన వ్యక్తి ఫొటో ముందు ఆయనకు ఇష్టమైన వంటకం పెట్టడం శాస్త్రోక్త శ్రాద్ధానికి ప్రత్యామ్నాయం కాదు. అది భావోద్వేగంతో చేసే జ్ఞాపక కార్యక్రమంగా ఉండవచ్చు. కానీ దానిని "పితృపక్షాల్లో తప్పనిసరిగా చేయాల్సిన శాస్త్రకర్మ"గా చెప్పడానికి ఆధారం లేదు. ఫొటో ముందు వంటకం పెట్టి, కాసేపటి తర్వాత దానిని తీసేయడం వల్ల శ్రాద్ధకర్మ పూర్తయిందని భావించడం కూడా శాస్త్రోక్త పితృకర్మ భావనకు సరిపోదు.అదేవిధంగా ఫొటోకు పూజ చేయడం కూడా పితృపక్ష శ్రాద్ధంలోని ప్రధాన విధానంగా చెప్పలేం. పితృదేవతల కోసం నిర్దేశించిన కర్మలో వ్యక్తి ఫొటోనే కేంద్రంగా చేసుకోవడం కంటే, పితృనామస్మరణతో యథావిధిగా పితృకర్మ చేయడానికే ప్రాధాన్యం ఉంటుంది. అందుకే "ఫొటో ముందు భోజనం పెట్టాం.. పితృకర్మ అయిపోయిం ది" అనుకోవడం సరైన అవగాహన కాదు.ఇక చనిపోయిన వారికి ఇష్టమైన పదార్థాల విషయానికి వస్తే మరింత జాగ్రత్త అవసరం. "వారికి మాంసం ఇష్టం.. కాబట్టి మాంసం పెట్టాలి", "మద్యం ఇష్టం.. కాబట్టి మద్యం పెట్టాలి" అని చెప్పడం శాస్త్రవిధానాన్ని వ్యక్తిగత ఇష్టాలతో కలిపేయడమే. ప్రాచీన శ్రాద్ధ సంప్రదాయాల్లో కొన్ని సందర్భాల్లో మాంసాహార పదార్థాల ప్రస్తావనలు ఉన్నాయన్నది నిజమే. మహాభారతంలోని శ్రాద్ధ వివరణల్లో కూడా మాంసం తదితర పదార్థాల ప్రస్తావన కనిపిస్తుంది. కాబట్టి "శ్రాద్ధంలో మాంసం అనే మాటే లేదు" అని చెప్పడం కూడా చారిత్రకంగా సరైనది కాదు.కానీ దానిని ఆధారంగా చేసుకుని నేటి రోజుల్లో చనిపోయిన వ్యక్తి ఫొటో ముందు ఆయనకు ఇష్టమైన మాంసం, గుడ్లు, మద్యం పెట్టడాన్ని శాస్త్రోక్త పితృపక్ష కర్మగా ప్రచారం చేయడం మాత్రం వేరే విషయం. ముఖ్యంగా మద్యం లేదా గుడ్లు ఫొటో ముందు పెట్టడమే పితృదేవతలను సంతృప్తిపరిచే శాస్త్రవిధానం అని చెప్పడా నికి ప్రామాణిక ఆధారం చూపాల్సి ఉంటుంది. ఆధారం లేకుండా అలాంటి మాటలను శాస్త్రం పేరుతో ప్రచారం చేయడం సరికాదు.అసలు పితృపక్షం మనకు గుర్తుచేసేది "చనిపోయినవారు ఏం తినేవారు?" అనే ప్రశ్న కంటే "పితృదేవతలకు చేయాల్సిన కర్తవ్యాన్ని ఎలా చేయాలి?" అనే ప్రశ్న. అందుకే పితృకర్మకు శాస్త్రంలో ఒక విధానం ఏర్పడింది. పిండప్రదానం, తర్పణం, శ్రాద్ధం వంటి కర్మలు యాదృచ్ఛికంగా ఏర్పడినవి కావు. పితృఆరాధనకు సంబంధించిన ఈ సంప్రదాయం వేదకా లం నుంచి వివిధ దశల్లో అభివృద్ధి చెంది, తరువాత శ్రాద్ధ రూపంలో స్థిరపడిందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.అందువల్ల పితృపక్షాల్లో ఫొటో ముందు పెద్ద విందు ఏర్పాటు చేసి, చనిపోయిన వ్యక్తికి ఇష్టమైన పదార్థాలను పెట్టడమే అసలు పితృపక్ష ధర్మం అని భావించడం ఒక అపోహ. పితృపక్షం అనేది జ్ఞాపకాన్ని భోజనంతో చూపించే కార్యక్రమం మాత్రమే కాదు. పితృదేవ తలను స్మరించి, శాస్త్రంలో నిర్దేశించబడిన పితృకర్మను భక్తి, శ్రద్ధతో నిర్వహించే కాలం.చనిపోయిన వారి ఫొటోను గౌర వంగా ఉంచుకోవడం వేరు.. పితృదేవ తలకు శాస్త్రోక్తంగా శ్రాద్ధం చేయడం వేరు. ఈ రెండింటినీ కలిపేసినప్పుడే అసలు గందరగోళం మొదలవుతుంది. పితృపక్షాల పేరుతో ఏది శాస్త్రం.. ఏది కేవలం ప్రచారంలోకి వచ్చిన పద్ధతి.. అనే విషయాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఇక్కడే ఉంది.పితృదేవతలను స్మరించేది భయంతో కాదు.. శ్రద్ధతో. ఫొటో ముందు భోజనం పెట్టడంలో కాదు.. పితృకర్మను అర్థం చేసుకుని యథావిధిగా ఆచరించ డంలోనే పితృపక్షాల అసలు భావం ఉంది .



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## కొత్తపల్లి రాజారంలో ఉద్రిక్తత



నివేదికలు ఉన్నాయి. అటవీ ప్రాంతం రక్షిత ప్రాంత పరిధిలో ఉండటంతో అనుమతుల అంశంపై సమస్యలు కొనసాగుతున్నాయి.తాజా ఘటనను నిరసిస్తూ గిరిజనులు ఆందోళనకు దిగారు. తమ జీవనాధారమైన పట్టుపురుగుల పెంపకాన్ని అడ్డుకోవద్దని వారు కోరారు. ఘటనపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

## పత్తి కొనుగోళ్లు సజావుగా సాగాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




నిర్మల్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):జిల్లాలో పత్తి పంట కొనుగోలు ప్రక్రియను రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత సజావుగా పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఈ ఏడాది రైతులు సాగు చేసిన పత్తి విస్తీర్ణం, ఆశించిన దిగుబడి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు కపాస్ కిసాన్ మొబైల్ యాప్ ద్వారా ముందస్తుగా స్లాట్ నమోదు చేసుకుని తమ పంటను విక్రయించుకునేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. రైతులు దళారుల బారిన పడి నష్టపోకుండా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర దక్కేలా అధికారులు పటిష్ట నిఘా ఉంచాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు అవసరమైన తాగునీరు, నీడ, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా రైతులకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, సీసీఐ అధికారి శరత్, డీఏవో సుజాత, డీఎంవో గంగు, మార్కెట్ కమిటీ చైర్మన్లు భీమ్‌రెడ్డి, షిండే ఆనంద్‌రావు పటేల్, కళ్యాణ్, భైంసా ఏఎంసీ వైస్ చైర్మన్ ఫారూఖ్ సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ కంజర్, చామన్‌పల్లి గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన



లక్ష్మణచాంద/నిర్మల్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు) :లక్ష్మణచాంద మండల పరిధిలోని న్యూ కంజర్, చామన్‌పల్లి గ్రామాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా విస్తృతంగా పర్యటించి భూ సమస్యలు, సమగ్ర రీ-సర్వే పనుల ప్రగతిని పరిశీలించారు. తొలుత న్యూ కంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక రైతులు, గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. గతంలో ఎల్‌ఆర్ యూపీ సమయంలో భూ రికార్డుల్లో తప్పుగా నమోదైన పట్టాల వివరాలపై విచారణ చేపట్టారు. గ్రామ సభలు నిర్వహించి అర్హులైన ప్రతి రైతు సమస్యను పారదర్శకంగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం చామన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సర్వేయర్లు సంబంధిత రైతుల సమక్షంలోనే డిజిటల్ యంత్రాలతో కొలతలు వేయాలని, సర్వే నంబర్ల నమోదులో ఎలాంటి సాంకేతిక తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. మిగిలిన కమతాల సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి పక్కాగా రికార్డులు సిద్ధం చేయాలన్నారు. ఈ పర్యటనలో ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్, తహశీల్దార్ సరిత, ఎంపీడీవో వనజ,సర్పంచులు మోహన్‌రెడ్డి, లక్ష్మి, ఉపసర్పంచులు ముత్యం,గంగారెడ్డితదితరులు పాల్గొన్నారు.

## చింతకుంటలో ప్రజల భాగస్వామ్యంతో 20 సీసీ కెమెరాలు ప్రారంభం




ముధోల్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):గ్రామాల శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో విలువైనదని, "గ్రామ భద్రత - మనందరి బాధ్యత" అనే సంకల్పంతో ప్రతి పల్లె ముందుకు రావాలని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల పిలుపునిచ్చారు. ముధోల్ మండలం చింతకుంట గ్రామంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా సమకూర్చిన నిధులతో గ్రామ పంచాయతీ భవనం పరిధిలో ఏర్పాటు చేసిన 20 అత్యాధునిక సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను బుధవారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలపై ఏర్పాటు చేసిన కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల గ్రామంలో అపరిచిత వ్యక్తులు, అనుమానితుల కదలికలను సులువుగా పసిగట్టవచ్చని, దొంగతనాలు, నేరాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాల దర్యాప్తునకు కీలక ఆధారాలు లభిస్తాయని చెప్పారు. చింతకుంట ప్రజల చొరవ ఇతర గ్రామాల ప్రజలకు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయికిరణ్, భైంసా రూరల్ సీఐ దీపక్, ఎస్సై ప్రదీప్, డబ్ల్యూఎస్సై పెర్సిస్, గ్రామ పెద్దలు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల పనులపై ప్రత్యేక బృందం నిరంతర నిఘా



నిర్మల్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించి నిర్మల్ జిల్లాలో చేపట్టే అన్ని అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పుష్కర ఏర్పాట్లు, ఘాట్ల నిర్మాణాలపై ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పుష్కర పనుల పర్యవేక్షణ బాధ్యతల కోసం జిల్లా స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని బాసర, ఖానాపూర్, సోన్ తదితర ప్రాంతాల్లో ఉన్న గోదావరి పుష్కర ఘాట్ల వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ పనుల పురోగతిని నివేదించాలన్నారు. ఇప్పటి నుంచే పకడ్బందీ ఏర్పాట్లు చేయడం వల్ల రాబోయే రోజుల్లో లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు స్నాన ఘాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, సీపీవో గంగారెడ్డి, ఉద్యానవన అధికారి రమణ, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, నీటిపారుదల ఈఈ అనిల్, ఆర్ అండ్ బీ ఈఈ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## భైంసా గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ఎస్పీ ఆదేశం




భైంసా/నిర్మల్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఆధ్వర్యంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ స్వయంగా దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను విన్నారు. చట్టపరమైన అంశాలపై స్థానిక పోలీస్ అధికారులతో మాట్లాడి వెంటనే నిష్పక్షపాత విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, చిన్నపాటి వివాదాలకు సంబంధించి షీ టీం అధికారులు ఇరువర్గాలకు అక్కడే కౌన్సిలింగ్ నిర్వహించి సమస్యలను సామరస్యంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రానికి వెళ్లే శ్రమ తప్పి భైంసాలోనే ఉన్నతాధికారులు అందుబాటులో ఉండటం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత గ్రీవెన్స్ డేలో అందిన పెండింగ్ దరఖాస్తుల పురోగతిని కూడా ఎస్పీ పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు రక్షణ కల్పించడమే తమ ప్రథమ కర్తవ్యమని ఆమె తెలిపారు.

## విద్యార్థిని భద్రతలో నిర్లక్ష్యం.. హెచ్‌ఎం స్వప్న సస్పెన్షన్



నిర్మల్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):పాఠశాలో చదువుకుంటున్న విద్యార్థిని భద్రత విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన తానూర్ మండలం బెంబర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. స్వప్నను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కఠిన ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల పనివేళలు ముగిసిన అనంతరం రెండో తరగతి చదువుతున్న చిన్నారి తరగతి గదిలోనే ఉండిపోగా, గమనించని సిబ్బంది గదికి బయట నుంచి తాళం వేసి వెళ్లిపోవడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకు హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు, విధి నిర్వహణలో ఘోర తప్పిదం చేసిన పాఠశాల స్కావెంజర్‌ను తక్షణమే ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించారు. పాఠశాల విడిచిపెట్టే సమయంలో ఉపాధ్యాయులు ప్రతి తరగతి గదినీ స్వయంగా పరిశీలించి పిల్లలంతా క్షేమంగా ఇళ్లకు వెళ్లారా లేదా అనేది నిర్ధారించుకోవాల్సిన కనీస బాధ్యత ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో విద్యార్థుల భద్రతా ఏర్పాట్లను ఎంఈవోలు, హెచ్‌ఎంలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల సంరక్షణలో చిన్నపాటి అలసత్వాన్ని కూడా ఉపేక్షించబోమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠినమైన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్ శాఖ చర్యలు:



నిర్మల్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):జిల్లాలో రహదారి ప్రమాదాలను పూర్తిగా అరికట్టి జీరో ఫాటాలిటీ జిల్లాగా నిర్మల్‌ను తీర్చిదిద్దడమే ధ్యేయంగా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల తెలిపారు. రాష్ట్ర డీజీపీ, రవాణా శాఖ కమిషనర్ ఇళంబరిది నేతృత్వంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఎస్పీ పాల్గొన్నారు. జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటి వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు మరియు తగిన లైటింగ్ ఏర్పాట్లు చేయాలని చర్చించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించకపోవడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు.

## 89 అంగన్‌వాడీ పోస్టుల భర్తీ అత్యంత పారదర్శకంగా చేపట్టాలి




నిర్మల్, అక్టోబర్ 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):నిర్మల్ జిల్లా పరిధిలోని వివిధ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 89 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎటువంటి అవకతవకలకు, సిఫార్సులకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో అంగన్‌వాడీ పోస్టుల నియామకాలపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా అందిన దరఖాస్తుల సంఖ్య, ధ్రువీకరణ పత్రాల పరిశీలన తీరును అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ రోస్టర్, మెరిట్ ఆధారంగా అర్హులైన పేద మహిళలకే న్యాయం జరిగేలా పారదర్శకంగా ఎంపికలు చేపట్టాలన్నారు. అభ్యర్థులు సమర్పించిన సర్టిఫికెట్లలో ఏవైనా సందేహాలుంటే సంబంధిత విద్యాశాఖ ద్వారా మరోసారి నిర్ధారించుకోవాలని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికే దళారుల మాటలు నమ్మి అభ్యర్థులు ఎవరూ డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, కేవలం ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారిణి జి. వినూత్న, సీడీపీవోలు, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## డీఏ బకాయిల చెల్లింపునకు ఉత్తర్వులు

చెల్లించనుంది. ఉద్యోగుల బకాయిలను జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.రెండు డీఏల అమలుతో రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.2,500 కోట్ల అదనపు భారం పడనుంది. మొత్తం 6,91,940 మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర అర్హులైన వర్గాలకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూరనుంది. దీర్ఘకాలంగా డీఏ బకాయిల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లకు తాజా ఉత్తర్వులతో కొంత ఊరట లభించనుంది.




OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER